కనీస వసతుల కరవు

- అభివృద్ధికి నోచుకోని యర్రవరం అరటి మార్కెట్
- నిలువనీడ లేక ఇబ్బందులు పడుతున్న రైతులు
- ఇక్కడ నుంచి ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు


యర్రవరం మార్కెట్‌లో ఎండలో ఉన్న అరటి గెలలు


ఇతర ప్రాంతాలకు తరలించేందుకు లారీల్లోకి లోడ్ చేస్తున్న అరటి గెలలు

ఏలేశ్వరం: మండలంలోని యర్రవరంలో జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న అరటి మార్కెట్ అభివృద్ధికి నోచుకోవడం లేదు. ఇక్కడ ప్రతిరోజూ వందల్లో అరటిగెలలు కొనుగోళ్లు, అమ్మకాలు జరుగుతాయి. ఇతర రాష్ట్రాలకు ఇక్కడ నుంచి అరటిగెలలు ఎగుమతులు జరుగుతున్నా రైతులకు కనీస వసతులు కరవయ్యాయి. మార్కెట్‌లో నిలువ నీడలేక అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు మార్కెట్‌ను అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.

అందరికీ అందుబాటులో..

యర్రవరంలోని అరటి మార్కెట్ జాతీయ రహదారికి సమీపంలోనే ఉండటంతో అందరికీ అందుబాటులో ఉంది. ఏలేశ్వరం, జగ్గంపేట, కిర్లంపూడి మండలాల్లో పలు గ్రామాలకు చెందిన రైతులు తమ పొలాల్లో పండిన అరటి గెలలను ఇక్కడే విక్రయిస్తారు. ప్రతిరోజూ ఎడ్లబండ్లు, వ్యాన్లు, ఆటోలు, మోటారు బైక్‌లపై అరటిగెలలను మార్కెట్‌కు తీసుకువస్తారు. సుమారు ఎకరం స్థలంలో మార్కెట్‌ను కొనసాగిస్తున్నారు. ఇక్కడ నుంచి ఒడిశా, కటక్, భువనేశ్వర్ తదితర ప్రాంతాలకు అరటిగెలలను ఎగుమతి చేస్తారు. దీంతో పాటు జాతీయ రహదారిపై వెళ్లే వాహనదారులకు స్థానిక చిరువ్యాపారులు అరటి పండ్లను విక్రయిస్తారు. వసతులు లేకపోవడంతో ప్రస్తుతం మార్కెట్‌లో అమ్మకాలు అంతంతమాత్రంగానే ఉన్నాయి.

రైతులకు ఇక్కట్లు

నిత్యం రైతులతో కళకళలాడే అరటి మార్కెట్‌లో వసతులు లేకపోవడంతో రైతులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ఎండ కాలం ప్రారంభం కావడంతో రైతులతో పాటు అరటిగెలలకు ఎండదెబ్బ తప్పడం లేదు. అలాగే వర్షాలు పడితే మార్కెట్ మొత్తం బురదమయంగా మారడంతో గెలలు ఉంచేందుకు అవస్థలు పడుతున్నారు. మార్కెట్‌లో షెడ్లు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. చుట్టుప్రక్కల గ్రామాల నుంచి వచ్చే రైతులు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండలోనే ఉండవల్సిన పరిస్థితి నెలకొంది.

మార్కెట్‌లో పలు రకాల గెలలు

మెట్టప్రాంతంలో అరటిసాగు ప్రత్యేకత కావడంతో ఇక్కడ పలు రకాల గెలలు అందుబాటులో ఉంటాయి. ఈ మార్కెట్‌లో కర్పూరం, చక్రకేళి, అమృతపాణి, బుసావళి తదితర రకాల అరటి గెలలు దొరుకుతాయి. వీటిధరలు అందుబాటులో ఉండడంతో కొనుగోలుదారులు అసక్తి చూపుతారు. రైతులు మార్కెట్‌కు తెచ్చిన గెలలను చిరువ్యాపారులు కొనుగోలు చేసి లారీల్లో ఇతర ప్రాంతాలకు తరలించి విక్రయిస్తుంటారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మార్కెట్‌లో వసతులు కల్పించాలని రైతులు కోరుతున్నారు.

> **మార్కెట్‌ను అభివృద్ధి చేయాలి**
>
> 
>
> అరటి మార్కెట్‌ను అభివృద్ధి చేయాలి. రైతులు ఇబ్బందులు పడకుండా నీడ కల్పించేందుకు షెడ్లు నిర్మించాలి. రైతులు కష్టాలు తప్పేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.
>
> – రామిశెట్టి వెంకటరమణ, ఏఎంసీ మాజీ డైరెక్టర్, యర్రవరం

క్లుప్తంగా

వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం


వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి మాఘ పౌర్ణిమ సందర్భంగా బుధవారం ప్రత్యంగిర హోమం నిర్వహించారు. పండితులు ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేద పండితులు యనమండ్ర శర్మ, గంగాధరబట్ల గంగబాబు, వనదుర్గ ఆలయ అర్చకుడు కోట వంశీ, పరిచారకుడు వేణు, వ్రతపురోహితులు కూచుమంచి ప్రసాద్, చెల్లపిల్ల ప్రసాద్ తదితరులు హోమం నిర్వహించారు. దేవస్థానం ఈఓ వి.సుబ్బారావు దంపతులతో పాటు 30 మంది భక్తులు రూ.750 టిక్కెట్‌తో హోమంలో పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి


విద్యార్థినులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ఇన్‌చార్జి డీడీ విజయశాంతి

తుని రూరల్: పదో తరగతి విద్యార్థులు ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకుని పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని గిరిజన సంక్షేమశాఖ ఇన్‌చార్జ్ డిప్యూటీ డైరెక్టర్ విజయశాంతి సూచించారు. మండలంలోని వి.కొత్తూరులో గిరిజన ఆశ్రమ బాలికోన్నత పాఠశాలను బుధవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు పదో తరగతి స్టడీ మెటీరియల్, రాత పుస్తకాలను పంపిణీ చేశారు. వార్షిక పరీక్షలకు ఉన్న నెలరోజుల సమయాన్ని విద్యార్థినులు ప్రణాళికాబద్ధంగా వినియోగించుకుని మంచి ఫలితాలు సాధించాలన్నారు. ఇందుకు ఉపాధ్యాయులు సహకరించాలని సూచించారు. ప్రధానోపాధ్యాయురాలు విజయకుమారి, డిప్యూటీ వార్డెన్ శుభలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారమే లక్ష్యం


జి.కొత్తపల్లిలో చేతిపంపును ప్రారంభిస్తున్న నాసా సిబ్బంది

శంఖవరం: గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారమే లక్ష్యంగా పని చేస్తున్నట్టు నాసా సంస్థ డైరెక్టర్ రాజా జ్యోతి ప్రేమదాస్ తెలిపారు. మండలంలోని జి.కొత్తపల్లి ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేసిన చేతి పంపును బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వెనుకబడిన ప్రాంతాల్లో సమస్యలను పరిష్కరించడమే నాసా లక్ష్యం అన్నారు. బడుగు, బలహీన వర్గాలను నాసా ఆదుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ఈగల విజయదుర్గ, వైస్ ఎంపీపీ ఈగల చిన్నమ్ములు తదితరులు పాల్గొన్నారు.

భక్తిభావం అలవరచుకోవాలి


సిరిపురం ఆధ్యాత్మిక సదస్సులో మాట్లాడుతున్న తిరుపతిరావు

ఏలేశ్వరం: ప్రతిఒక్కరూ భక్తిభావం పెంచుకోవాలని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నడిశెట్టి తిరుపతిరావు సూచించారు. సిరిపురంలోని శ్రీచిద్గగనానంద గీతాశ్రమంలో మహేషానందాస్వామి ఆధ్వర్యంలో బుధవారం ఆధ్యాత్మిక సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో మానవ సంబంధాలు అంతంతమాత్రంగానే ఉన్నాయన్నారు. మానవులు మానసిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. వీటిని అధిగమించాలంటే భక్తి ఒక్కటే సరైన మార్గమని తెలిపారు. కార్యక్రమంలో యల్లపు సూర్యనారాయణ, ఆకుల నూకపతిరావు, తోట వీరమహేశ్వరరావు, అల్లం సీతారత్నం, మజ్జూరి వెంకటలక్ష్మి, పెదకాపు తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ అంతరాయం

తుని: హంసవరం పరిధిలో విద్యుత్ లైన్ల మార్పుల కారణంగా శుక్రవారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్ కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వీరభద్రరావు బుధవారం తెలిపారు. అన్నయ్యపేట, ఒంటిమామిడి, ఏవీ నగరం, కత్తిపూడి, అన్నవరం, అన్నవరందేవస్థానం, తేటగుంట సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ కరెంటు ఉండదన్నారు. విద్యుత్ అంతరాయాన్ని గమనించి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

గండేపల్లి: విద్యార్థులు అత్యాధునిక పరిజ్ఞానంతో తమను తాము మెరుగు పరుచుకుంటూ నూతన సాంకేతికతను అందిపుచ్చుకోవాలని ప్రగతి ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ పి.కృష్ణారావు సూచించారు. మండలంలోని సూరంపాలెం ప్రగతి ఇంజినీరింగ్ కళాశాలలో డేటా ఫ్లోమాస్టీ రెట్రీవల్, ఇన్స్పెషన్ బెస్ట్ ప్రాక్టీసెస్ అనే అంశంపై మూడు రోజుల పాటు జరిగిన వర్క్‌షాప్‌లో చివరిరోజు బుధవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల అభ్యున్నతికి ఇటువంటి వర్క్‌షాప్‌లు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో బ్రెయినోవిజన్ సొల్యూషన్స్ ప్రైవేటు లిమిటెడ్ అకాడమీ ప్రతినిధులు నారాయణస్వామి, డి.ఓబులయ్య, కె.కిరణ్, ఎ.రాధాకృష్ణ, కళాశాల డైరెక్టర్ ఎంవీ హరనాథబాబు, కె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పోలవరం కాలువ పరిశీలన


కుమ్మరిలోవ వద్ద పోలవరం కాలువ ఎలైన్‌మెంట్‌ను పరిశీలిస్తున్న ఆర్డీఓ శ్రీరమణి

తుని రూరల్: మండలంలోని కుమ్మరిలోవ కాలనీ వద్ద పోలవరం ఎడమ ప్రధాన కాలువ ఎలైన్‌మెంట్‌ను పెద్దాపురం ఆర్డీఓ కె.శ్రీరమణి బుధవారం పరిశీలించారు. ఇటీవల ఆర్‌వీఆర్ కాంట్రాక్ట్ సంస్థ కాలువ పనులు చేపట్టగా నిర్వాసితులు వరుసగా రెండు రోజులు అడ్డుకున్న విషయం తెలిసిందే. క్షేత్రస్థాయిలో కాలువ ఎలైన్‌మెంట్ పరిశీలించిన ఆర్డీఓ శ్రీరమణి వద్ద నిర్వాసితులు, బాధిత రైతులు తమ గోడు వినిపించుకున్నారు. భూసేకరణకు నోటిఫికేషన్ జారీ చేయకుండానే అవార్డును కోర్టులో జమ చేశారని రైతులు వివరించారు. కొంత మంది కోర్టును ఆశ్రయించినట్టు జక్కాన రామచంద్రరావు, జక్కాన రామునాయుడు, గేదెల కృష్ణ, తదితరులు పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులు, రైతుల సమస్యలను కలెక్టర్‌కు తెలియజేస్తానని ఆర్డీఓ హామీ ఇచ్చారు. పోలవరం ఇరిగేషన్ ఈఈ బి.గోవిందు, రెవెన్యూ సర్వేయర్ దేవుడు, ఆర్ఐ తాతారెడ్డి, వీఆర్వో నేతాజీ, రైతులు పాల్గొన్నారు.

రైతులతో కలెక్టర్ చర్చలు

కలెక్టరేట్‌లో కలెక్టర్ షణ్మోహన్, పోలవరం ఎడమ ప్రధాన కాలువ (కుమ్మరిలోవ) భూ బాధిత రైతుల మధ్య చర్చలు సానుకూలంగా జరిగినట్టు రైతులు తెలిపారు. తమను సంప్రదించకుండా భూసేకరణ ఎలా చేశారని, నష్టపరిహారం ఇవ్వకుండా కోర్టులో జమ చేయడం అంగీకరించబోమని రైతులు స్పష్టం చేశారు. బహిరంగ మార్కెట్ ధరను చెల్లిస్తే స్వచ్ఛందంగా 46.92 ఎకరాల భూములు ఇస్తామని పేర్కొన్నారు. మార్కెట్ విలువ ఎకరా రూ.మూడు కోట్లు ఉండగా రూ.1,87,580 చొప్పున కోర్టులో జమ చేయడం అన్యాయమన్నారు. దీనిపై ఇరిగేషన్ అధికారులతో కలెక్టర్ చర్చించారని, భూములు నష్టపోతున్న రైతులకు నష్టం లేకుండా లీజు ప్రతిపాదికన అంశం తెరపైకి వచ్చిందన్నారు. అందుకు తాము అంగీకరించడంతో విషయాన్ని రాష్ట్రస్థాయిలో ఉన్నత అధికారులకు నివేదించి తదుపరి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చినట్టు బాధిత రైతులు జక్కాన రామచంద్రరావు, జక్కాన రామునాయుడు తెలిపారు. ఈ చర్చల్లో పోలవరం ఇరిగేషన్ అధికారులు, రెవెన్యూ అధికారులు, బాధిత రైతులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఫిజియోథెరపీ సేవలు


దివ్యాంగ చిన్నారితో వ్యాయామం చేయిస్తున్న ఫిజియోథెరపిస్టు సోమేశ్వరరావు

కోటనందూరు: స్థానిక నాన్‌భవిత కేంద్రంలో దివ్యాంగ చిన్నారులకు బుధవారం ఫిజియోథెరపీ సేవలు అందించారు. ఫిజియోథెరపిస్టు టీఎన్ఎస్ సోమేశ్వరరావు పిల్లలతో వారి అవసరానికి అనుగుణంగా వ్యాయామాలు చేయించారు. ప్రతిరోజూ చేయించాల్సిన వ్యాయామాలు, ఆరోగ్య పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐఈఆర్పీలు పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో అగ్ని ప్రమాదం


మంటలను అదుపు చేస్తున్న ప్రత్తిపాడు అగ్నిమాపక సిబ్బంది

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు - లంపకలోవ రహదారిలోని సుద్దగెడ్డ వాగు సమీపంలో బుధవారం జరిగిన అగ్ని ప్రమాదంలో రూ.లక్ష ఆస్తి నష్టం వాటిల్లింది. వివరాల్లోకి వెళితే..ప్రత్తిపాడు గ్రామానికి చెందిన మదినే మురళీకృష్ణ తన పొలంలో ట్రాక్టర్‌తో వరి పంటను నూర్చుతున్నారు. ట్రాక్టర్ సైలెన్సర్ నుంచి వచ్చిన నిప్పురవ్వలు పడి వరిగడ్డికి నిప్పు అంటుకుంది. అదే సమయంలో భారీగా ఈదురుగాలులు వీయడంతో మంటలు చుట్టూ వ్యాపించాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ. లక్ష విలువైన ధాన్యం దగ్ధమైంది. సమాచారం అందుకున్న ప్రత్తిపాడు ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ ఎంజీ రత్నంరాజు తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

మాట మార్చడం చంద్రబాబుకు అలవాటే

- మాజీ ఎంపీ హర్షకుమార్


తునిలో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ హర్షకుమార్

తుని: అధికారంలోకి రాక ముందు ఒక మాట, వచ్చాక మరో మాట చెప్పడం ముఖ్యమంత్రి చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ అన్నారు. తుని ఉడిపి హోటల్‌లో బుధవారం సాయంత్రం పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి జీవీ సుందర్‌తో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సుందర్‌ను ఆశీర్వదించాలని హర్షకుమార్ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో వ్యవస్థలు నిర్వీర్యం అయ్యాయని చంద్రబాబు చెప్పారని, ఇప్పుడు అధికారంలోకి వచ్చాక చేస్తున్నది ఏమిటో ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోసం అధికారులను ప్రభావితం చేస్తున్నారని విమర్శించారు. పథకాలు ఇస్తామని చెప్పడం తర్వాత మరచి పోవడం చంద్రబాబుకు అలవాటే అన్నారు. తల్లికి వందనం, రైతు భరోసా, మహిళలకు ఉచిత బస్సు, నిరుద్యోగ భృతి ఎవరికి ఇచ్చారో చెప్పాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో సుందర్‌కు తొలి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. దళిత నాయకులు టి.కిరణ్‌కుమార్, దారా సురేష్ పాల్గొన్నారు.

రైతులకు బీమా పథకంపై అవగాహన


గోపాలపట్నంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యానవనశాఖాధికారి విజయలక్ష్మి

తొండంగి: ప్రకృతి వైపరీత్యాల సమయంలో కొబ్బరి రైతుల నష్టపోకుండా ప్రభుత్వం అతి తక్కువ ప్రీమియంతో బీమా పథకాన్ని అమలు చేస్తుందని తుని ఉద్యానవనశాఖాధికారి జి.విజయలక్ష్మి తెలిపారు. గోపాలపట్నంలో కొబ్బరి రైతులకు బుధవారం బీమా పథకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అగ్రికల్చర్ ఇన్స్రూ కంపెనీ లిమిటెడ్, కోకోనట్ బోర్డు, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో 75 శాతం రాయితీతో కొబ్బరి చెట్లకు బీమా పథకాన్ని అమలు చేస్తున్నట్టు తెలిపారు. ఒక్కో చెట్టుకు రైతు రూ.3.50 చెల్లించాలన్నారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా చెట్లు దెబ్బతింటే బీమా వర్తింపజేసి ఒక్కో చెట్టుకు రూ.1750 చొప్పున సదరు రైతు బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారన్నారు. కొబ్బరి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బీమా వర్తించే అంశాలు

తుపానులు, వడగండ్ల వాన, సుడిగాలి, భారీ వర్షాలు

వరదల కారణంగా చెట్లకు ముప్పు

- చీడ పీడల వలన చెట్లకు నష్టం కలుగుట
- భూకంపం, కొండచరియలు విరుగుపడుట, సునామీ
- తీవ్రకరువు సమయంలో చెట్టు మొత్తం నష్టపోవుట

భక్తిశ్రద్ధలతో విగ్రహాల ఊరేగింపు


జాతీయ రహదారిపై ప్రత్యేక వాహనంలో తరలిస్తున్న శివలింగం, నందీశ్వరుని విగ్రహాలు

గండేపల్లి/జగ్గంపేట: జాతీయ రహదారిపై స్వామి వార్ల విగ్రహాల ఊరేగింపు బుధవారం కన్నులపండువగా జరిగింది. కాతేరు నుంచి ఇ్రరిపాకకు తరలిస్తున్న భారీ శివలింగం, వేంకటేశ్వరస్వామి విగ్రహాలకు బుధవారం మండలంలోని మురారిలో భక్తులు ఘన స్వాగతం పలికారు. ఇ్రరిపాకలో ఏలేరు నది తీరాన ప్రతిష్ఠించనున్న ఈ విగ్రహాలను ప్రత్యేక వాహనాల్లో తరలిస్తుండగా రహదారి పొడవున భక్తులు పూలు చల్లి, కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గండేపల్లిలో భారతీయ ధర్మ పరిషత్ జిల్లా అధ్యక్షులు పాలచర్ల నాగేంద్ర చౌదరి, మురారి గ్రామ ఉప సర్పంచ్ జాస్తి వసంత్ ఆధ్వర్యంలో భక్తులు విగ్రహాలకు ఘన స్వాగతం పలికారు. భజన బృందాలు భక్తి గీతాలు ఆలపించాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ ఇ్రరిపాకలోని ఏలేరు నది తీరాన శివ కేశవుల విగ్రహాలను ప్రతిష్ఠించి ఈ ప్రాంతాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు.

రత్నగిరిపై భక్తులకు ఇక్కట్లు


పశ్చిమ రాజగోపురం వద్ద చెట్టు నీడలో సేద తీరుతున్న భక్తులు

అన్నవరం: రత్నగిరిపై అధికారులు ముందుచూపు లేకుండా పశ్చిమ రాజగోపురం వద్ద షామియానాలు తొలగించడంతో బుధవారం సత్యదేవుని ఆలయానికి వచ్చిన భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వివరాల్లోకి వెళితే... గత శనివారం భీష్మ ఏకాదశి సందర్భంగా సత్యదేవుని ఆలయ ప్రాంగణంలో పలు చోట్ల షామియానాలు వేశారు. ప్రధానంగా పశ్చిమ రాజగోపురం ఎదురుగా షామియానాలతో పాటు రోడ్డు మీద కార్పెట్ వేయడంతో భక్తులు సేద తీరారు. వాటిని మంగళవారం సాయంత్రం తొలగించడంతో బుధవారం మాఘ పౌర్ణిమ సందర్భంగా సత్యదేవుని దర్శనానికి వచ్చిన వేలాది మంది భక్తులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో భక్తులు అల్లాడిపోయారు. చెట్ల నీడన తలదాచుకున్నారు. దీనిపై దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావును వివరణ కోరగా పశ్చిమ రాజగోపురం వద్ద షామియానాలు తీసేసిన విషయం తనకు ఆలస్యంగా తెలిసిందన్నారు. త్వరలో దేవస్థానంలో చలువ పందిర్లు వేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఆశాజనకంగా అపరాల పంటలు


డి.పోలవరంలో రైతులతో కలసి అపరాల పంటలను పరిశీలిస్తున్న డీడీఏ శ్రీహరి

తుని రూరల్: విత్తన శుద్ధి, సస్యరక్షణ చర్యలు చేపట్టడంతో రబీ అపరాల పంటలు ఆశాజనకంగా ఉన్నాయని డీఆర్‌సీ డీడీఏ శ్రీహరి, ఏడీఏ మాధవీ అన్నారు. జాతీయ ఆహార భద్రత పథకంలో భాగంగా మండలంలోని రాజుపేట, డి.పోలవరం గ్రామాల్లో సాగు చేస్తున్న అపరాల పంటలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తక్కువ పెట్టుబడితో రైతులు సాగు చేసే అపరాల పంటలతో అధిక లాభం పొందవచ్చన్నారు. మండల వ్యవసాయ అధికారి బి.అశోక్ కుమార్, ఏఈఓ పి.జగ్గ అప్పారావు, రైతులు, రైతు సేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

అపరాల పంటల పరిశీలన

కోటనందూరు: ఈ ఏడాది అపరాల సాగు ఆశాజనకంగా ఉందని జిల్లా వనరుల కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ శ్రీహరి అన్నారు. నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ మిషన్ క్లస్టర్ డిమోన్‌స్ట్రేషన్‌లో భాగంగా మండలంలోని కాకరాపల్లిలో మినుము పంటను బుధవారం ఆయన తనిఖీ చేశారు. మినుము పంట ఎదుగుదలను పరిశీలించిన ఆయన పంటకు ఆశించిన తెగుళ్లు, వాటి నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. అపరాల సాగులో మంచి దిగుబడులు సాధించాలంటే ఎరువులు, పురుగుమందుల యాజమాన్యమే కీలకమని రైతులకు సూచించారు. పంటను నిరంతరం పర్యవేక్షిస్తూ తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ మాధవి, ఏఓ కేజే చంద్రశేఖర్, ఏఈఓలు కేవీ శివకుమారి, నల్లమిల్లి సురేష్, వీఏఏ సాయి, రైతులు పాల్గొన్నారు.

పౌష్టికాహార పంటల సాగుపై దృష్టి సారించాలి

రౌతులపూడి: రైతులు పౌష్టికాహార పంటల సాగుపై దృష్టి సారించాలనిపెద్దాపురం డివిజన్ డీడీఏ హరి అన్నారు. మండలంలోని ములగపూడిలో రైతులు సాగు చేసిన మినుము, పెసర పంటలను బుధవారం ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏడీఏ మాధవీలత, ఏఓ రెడ్డి ఈశ్వరరావు, సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

సాగర తీరం.. భక్తజనహారం

- ఆలయాలకు పోటెత్తిన భక్తులు


దానవాయిపేట తీరంలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

తొండంగి: మాఘపౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం పుణ్యస్నానాలు ఆచరించేందుకు వచ్చిన వేలాది మంది భక్తులతో మండలంలోని దానవాయిపేట, అద్దరిపేట తదితర సముద్ర తీరాలు కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచి మండలంలోని పలు గ్రామాలతో పాటు గొల్లప్రోలు, శంఖవరం, ఏలేశ్వరం, ప్రత్తిపాడు, కోటనందూరు, రౌతులపూడి, తుని మండలాల నుంచి ప్రజలు వాహనాలపై వేలాదిగా తరలివచ్చారు. దానవాయిపేట, తాటియాకులపాలెం, కొత్తచోడిపల్లిపేట, పెరుమాళ్లపురం, అద్దరిపేట, యర్రయ్యపేట, అన్నయ్యపేట, కొత్తపేట, వాడముసలయ్యపేట, తాటియాకులపాలెం తదితర తీరాల్లో పుణ్యస్నానాలు ఆచరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు దాతలు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో మజ్జిగ, పాలు, పులిహోర పంపిణీ చేశారు.

ఘనంగా విశ్వేశ్వరుని రథోత్సవం

ఒంటిమామిడిలో విశ్వేశ్వరస్వామి రథోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. పండితులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను రథంపై ఉంచి పూజలు చేశారు. ఆలయం చుట్టూ మూడుసార్లు ప్రదక్షిణ గావించారు. వేలాది మంది భక్తులు తిలకించారు.

ఘనంగా త్రిశూల స్నానం

దానవాయిపేట సముద్ర తీరంలో బుధవారం విశ్వేశ్వరుడు, రాజరాజేశ్వరి అమ్మవార్లకు త్రిశూల స్నానం నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు శంకరణం గోవందరాజుశర్మ, శంకర శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను పల్లకీపై ఉంచి ఒంటిమామిడి నుంచి దానవాయిపేట వరకూ ఊరేగింపుగా తీసుకెళ్లారు. సాగర తీరంలో స్వామి అమ్మవార్లకు త్రిశూల స్నానం చేయించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.,

వైభవంగా మాఘపౌర్ణమి వేడుకలు

ఏలేశ్వరం: మాఘ పౌర్ణమి వేడుకలు తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో బుధవారం ఘనంగా జరిగాయి. తెల్లవారుజాము నుంచి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. వీహెచ్‌పీ మండల కార్యదర్శి కటకం కిరిటీ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద దుర్గాదేవి ఆలయంలో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. వీహెచ్‌పీ అనుబంధ దుర్గావాహిణి, మాతృశక్తి సంఘాల సభ్యులు విష్ణుసహస్ర నామాలు, లలితా సహస్రనామాలు, భగవద్గీత, భక్తి గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో కుమారి, ఇందిరా, ఉమ, హైమావతి, మంగామణి, రమాదేవి, మాధురి, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.


ఏలేశ్వరంలో పారాయణ పఠనం చేస్తున్న మహిళలు

ఉచ్చు...ప్రజలకు చిచ్చు

- వన్యప్రాణుల కోసం విద్యుత్ తీగలతో ఉచ్చులు
- తగిలి వ్యక్తికి గాయాలు


ఒమ్మంగిలో వేటగాళ్లు అమర్చిన విద్యుత్ తీగలు

ప్రత్తిపాడు రూరల్: మండల పరిధిలోని గ్రామాల్లో వన్యప్రాణుల వేట యథేచ్ఛగా సాగుతోంది. పలువురు వేటగాళ్లు విద్యుత్ తీగలతో ఉచ్చులు పెడుతున్నారు. మండలంలోని పెద్దిపాలెం, కిత్తమూరిపేట, బవురువాక, ఒమ్మంగి, పోతులూరు తదితర గ్రామాల్లో విద్యుత్ తీగలను అమర్చి వేటగాళ్లు వన్యప్రాణులను మట్టుపెడుతున్నారు. తాజాగా గత ఆదివారం రాత్రి మండలంలోని ఒమ్మంగి గ్రామానికి చెందిన సూర్నీడి త్రిమూర్తులు, దేశెట్టి రాంబాబు సరుగుడు తోటకు నీరు పెట్టేందుకు పొలం వెళ్లారు. శంకవరపు వారి పొలంలో సూర్నీడి త్రిమూర్తులు అనే రైతు కాళ్లకు అడవి పందుల కోసం పెట్టిన విద్యుత్ వైరు తగిలి గాయపడిన విషయం బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆయనతో వెళ్లిన రెండో వ్యక్తి బంధువులకు సమాచారం ఇవ్వడంతో వారు వెంటనే అక్కడకు చేరుకున్నారు. క్షతగాత్రుడిని ప్రత్తిపాడు ప్రభుత్వం ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. దీనిపై ప్రత్తిపాడు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.